@netifocusnews @focustv

http://epaper.netifocusnews.com

www.netifocusnews.com

TS-18-0006625

FOCUS TELUGU TV

అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || ఆదివారం 11, ఆగస్ట్ 2024 || పేజీలు: 04


## వయనాడ్ బాధితులకు అండగా ఉంటా..

విలయ ప్రాంతాన్ని ఏరియల్ సర్వే ద్వారా వీక్షించిన ప్రధాని

సీఎం పినరయ్ విజయన్‌తో కలిసి ఘటనపై సమీక్ష..

అన్ని విధాలా అండగా ఉంటామని బాధితులకు ప్రధాని హామీ..





తిరువనంతపురం, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 10:

### కేరళలో ప్రకృతి ప్రకోపానికి బలైన

వయనాడ్ బాధితులకు అండగా ఉంటామని ప్రధాని మోడీ ప్రకటించారు. వారికి తగి సహాయం అందిస్తామని అన్నారు. వయనాడ్ విలయ ప్రాంతంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. భారీ వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని మోదీ పరామర్శించారు. అనంతరం కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్రమంత్రి సురేష్ గోపి, ఇతర యవనాడ్ ఉన్నతాఅధికారులతో ప్రధాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. మిగతా 2లో..





## తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ సహకారం

బయోడిజైన్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యం

ప్రభుత్వంతో భాగస్వామ్యం.. శాటిలైట్ సెంటర్‌పై ఆసక్తి

సీఎం రేవంత్‌కు లేఖ అందించిన యూనివర్సిటీ బృందం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 10:

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకు వచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ని సందర్శించింది. స్టాన్ ఫోర్డ్ బైర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా హెల్త్ కేర్ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విద్య, నైపుణ్య అభివృద్ధి అంశాలపైనే మిగతా 2లో..





## సుంకిశాల ప్రమాదానికి బాధ్యులెవరు?

- సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## ఆర్టీసీ కార్గోలో రాఖీలు



వివరాలు 02లో..

## హైదరాబాద్‌లో జోయిటీస్ విస్తరణ



గూగుల్ ప్రధాన కార్యాలయంలో సిఎం రేవంత్

పలు అంశాలపై అధికారులతో చర్చ..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 10:

అమెరికాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతోంది. కాలిఫోర్నియాలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం సందర్శించారు. ఆ సంస్థ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై రేవంత్‌రెడ్డి చర్చలు జరిపినట్లు సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. గూగుల్ ప్రతినిధులు వారికి ఆహ్వానం పలికారు.సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జోయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లోని కెపాబులిటీ సెంటర్ విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ విస్తరణ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందలాది మందికి కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి. హైదరాబాద్‌లో జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను మిగతా 2లో..

## లక్ష ఆదాయం వారికే తెల్ల రేషన్ కార్డు

- సక్సేనా కమిటీ సిఫారసుల మేరకు మంజూరు
- పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల గరిష్ట వార్షికాదాయం వారే అర్హులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వివరాలు 02లో..



## విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలుండాలి

- ఎవరికైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటా
- వారానికి ఒకసారి విద్యుత్ కేంద్రాల పరిస్థితిపై నివేదికలు పంపించాలి
- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 10:

కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షపాతాలను దృష్టిలో ఉంచుకుని జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట విద్యుత్ ఉత్పత్తిని సాధించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని హైడల్ ప్రాజెక్టుల సీఈలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క థర్మల్, హైడల్ విద్యుత్తు ఉత్పాదనకు సంబంధించిన ఆ శాఖల సీఈలతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి ప్లాంట్‌లో కనీసం 17 రోజుల విద్యుత్ ఉత్పాదనకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మిగతా 2లో..







# తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ సహకారం

(మొదటి పేజీ తరువాయి..)

ప్రధానంగా చర్చలు జరిగాయి. తెలంగాణలో ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, న్యూ లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రభుత్వం స్టాన్ ఫోర్డ్ వారిని ఆహ్వానించింది. పరస్పరం అధునాతన పరిజ్ఞానాన్ని పంచుకునే కార్యక్రమాలతో పాటు ఉమ్మడిగా పరిశోధనలు నిర్వహించాలనే అభిప్రాయాలు ఈ సమావేశంలో వ్యక్తమయ్యాయి. తెలంగాణలో స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ శాటి లైట్ సెంటర్‌ను ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిగాయి. స్టాన్‌ఫోర్డ్ అధ్వర్యంలో జరిగే బయోడిజైన్ ఆవిష్కరణలను రాష్ట్రంలో అకడమిక్, హెల్త్ కేర్ విభాగాలకు అనుసంధానం చేయాలని తన ఆలోచనలను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వారితో పంచుకున్నారు. ఈ సమావేశం అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి తగిన సహకారం అందిస్తామని యూనివర్సిటీలోని బయోడిజైన్ విభాగం అధిపతులు డాక్టర్ అనురాగ్ మైరాల్, డాక్టర్ జోష్ మాకోవర్ ప్రకటించారు. తమ ఆసక్తిని వ్యక్తం చేస్తూ వారు ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డికి లేఖను అందించారు. భారీ వైద్య పరికరాల పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని, దీంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని లేఖలో ప్రస్తావించారు. వైద్య పరికరాల విద్య, కొత్త ఆవిష్కరణలకు తమ మద్దతు ఉంటుందని ఆ లేఖలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీతో భాగస్వామ్యం పంచుకోవటం తెలంగాణ యువత భవితకు కొత్త బాటలు వేస్తుందన్నారు. హెల్త్ కేర్ రంగంలో యువతకు నైపుణ్యాల అభివృద్ధిని అందించేందుకు స్టాన్ఫోర్డ్ భాగస్వామ్యం కోరినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలో పరిశ్రమలు, కొత్త ఆవిష్కరణల్లో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పారు. స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ లాంటి ప్రపంచ స్థాయి విభాగాలు కలిసి వస్తే స్కిల్స్ డెవలప్మెంట్‌లో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ భాగస్వామ్యం ఒక్క తెలంగాణ వృద్ధికే కాకుండా.. యావత్ ప్రపంచానికి హెల్త్ కేర్ రంగంలో కీలకంగా నిలుస్తుందని అన్నారు. స్టాన్ ఫోర్డ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏర్పాటయ్యే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, లైఫ్ సైన్సెస్ యూనివర్శిటీల లక్ష్యం నెరవేరుతుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ పరిశ్రమల వృద్ధికి మరో ముందడుగు పడుతుందన్నారు.

# సుంకిశాల ప్రమాదానికి ఎవరు బాధ్యులు?

- సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్‌కు దగ్గరలో నిర్మిస్తున్న సుంకిశాల. సాగర్ నుంచి సర్జ్‌పూల్‌లోకి నీటిని నింపేందుకు ఏర్పాటు చేసిన మూడు టన్నెళ్లలో ఓ టన్నెల్ గేటు ఎట్టుకుపోగా.. 170 అడుగుల ఎత్తులో నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. అయితే, ఈ నెల 2న ఘటన జరగ్గా.. కావాలనే ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, ప్రభుత్వం మాత్రం రిటైనింగ్ వాల్ కూలడం పెద్ద విషయం కాదని.. నిర్మాణ సంస్థే మళ్లీ నిర్మిస్తుందంటూ చిన్న విషయంగా చూపే ప్రయత్నం చేస్తున్నది. అయితే, సుంకిశాల ప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? సుంకిశాల ప్రమాదానికి ఎవరు బాధ్యులు? అంటూ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదాన్ని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు? సుంకిశాల ప్రమాదంపై ప్రభుత్వం నుంచి ఎవరూ మాట్లాడడం లేదంటూ నిలదీశారు. నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఎవరు ఆపుతున్నారని ప్రశ్నించిన ఆయన.. సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలుండాలి

(మొదటి పేజీ తరువాయి..)

మనమంతా నిబద్ధతతో, మనసుపెట్టి పనిచేయాలన్నారు. నిర్లక్ష్యానికి, అలసత్వానికి, ఆలస్యానికి తావు ఇవ్వొద్దన్నారు. విద్యుత్ శాఖలో పని చేయడం అంటే ప్రజల కోసం నిరంతరం పనిచేయడమే. విద్యుత్ శాఖ అంటేనే 24/7 పనిచేసే అత్యవసర శాఖ అని అధికారులు, సిబ్బంది గుర్తుంచుకోవాలన్నారు. సమాజానికి వెలుగులు ఇచ్చే శాఖలో పనిచేస్తున్నామని పూర్తిగా సేవా దృక్పథంతో కూడిన బాధ్యతల్లో ఉన్నామని సిబ్బంది గుర్తించాలన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే వినేందుకు, వాటిని పరిష్కరించేందుకు 24 గంటల పాటు తాను అందుబాటులో ఉంటానని డిప్యూటీ సీఎం.. విద్యుత్ శాఖ మంత్రి అధికారులు, సిబ్బందికి భరోసా ఇచ్చారు. విద్యుత్ ఉత్పాదనలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సకాలంలో తీసుకోవాల్సిన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల గతంలో శ్రీశైలం, జూరాల వంటి హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తద్వారా ఏర్పడిన నష్టాన్ని గుర్తు చేశారు. ఇక ఇప్పుడు నిర్ణయాలు తీసుకోవడంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదన్నారు. ఇందుకుగాను వారానికి ఒకసారి విద్యుత్ కేంద్రాల పరిస్థితి, ఉత్పాదనకు సంబంధించిన నివేదికలు తనకు పంపాలని ఆదేశించారు. అధికారులకు ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించి సీఈలు నిర్లక్ష్యం వహించినట్లుగా ఉంటే రాతపూర్వకంగా వారి నుంచి వివరణ తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# లక్ష ఆదాయం వారికే తెల్ల రేషన్ కార్డు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

రెండు రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఉన్నవారికి ఆప్షన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి విధివిధానాలపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సందర్భంగా రేషన్ కార్డుల జారీపై చర్చించింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1 లక్ష ఆదాయం లేదా 3.50 ఎకరాల మాగాణి లేదా 7.5 ఎకరాల లోపు చెలక ఉన్న వారిని తెల్ల రేషన్ కార్డుకు ఎంపిక చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించింది. పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల గరిష్ట వార్షికాదాయం ఉన్న వారిని అర్హులుగా చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అన్ని పార్టీలు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని ఉపసంఘం నిర్ణయించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేఖలు రాసి సూచనలు తీసుకోవాలని నిర్ణయించింది. కేబినెట్ సబ్ కమిటీ భేటీ అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... సక్సేనా కమిటీ సిఫార్సులను రేషన్ కార్డుల మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 89 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయని, పది లక్షల కార్డులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు.

# ఆర్టీసీ కార్గోలో రాఖీలు

## 24గంటల్లోనే రాఖీలను డెలివరీ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

ఈ నెల 19వ తేదీన రాఖీ పండుగ నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాఖీ పండుగకు నాలుగైదు రోజుల ముందు నుంచి కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లు తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని కూడా పంపే అవకాశం కల్పించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలను పంపించుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్గో సెంటర్లలో బుక్ చేసిన 24 గంటల్లోనే రాఖీలను డెలివరీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్గో అధికారులు కౌంటర్లు తెరవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, రాఖీల రవాణా ధర ఇంకా ఖరారు కాకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి కోసం వేచి ఉన్నారు. రాఖీల రవాణకు సంబంధించిన ధరల విషయంలో సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సుంకిశాల రిటైనింగ్‌వాల్ ఘటనపై సమగ్ర దర్యాప్తు

- సిపిఎం నేత జూలకంటి రంగారెడ్డి డిమాండ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

సుంకిశాల రిటైనింగ్‌వాల్ కూలిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ప్రాంతాన్ని సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. నిర్మాణ పనులు చేస్తున్న మెగా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాలపరిమితిలో నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న పనులను పర్యవేక్షించడం లేదన్నారు. కూలిపోయిన సమయంలో పనిచేసే వారు లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదన్నారు. పర్వేదుల నుంచి సుంకిశాల ప్రాజెక్టు వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు కూడా చేయలేదన్నారు. నిర్మాణం చేస్తున్న సంస్థ కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, వరదలు పైనుంచి వస్తున్నప్పుడు సిమెంట్ పనులు చేయడం, సరిగా క్యూరింగ్ కాలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న పనులపై నిరంతరం పర్యవేక్షణ పెట్టి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ప్రతినిధి బృందంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండా శ్రీశైలం, కూనురెడ్డి నాగిరెడ్డి, చిన్నపాక లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పీ నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, షేక్ బషీర్, పూల సత్యనారాయణ, దుబ్బ రామచంద్రం, బాపురెడ్డి ఉన్నారు.

# వయనాడ్ బాధితులకు అండగా ఉంటా..

(మొదటి పేజీ తరువాయి..)

వయనాడ్‌లో కొండచరియలు విగిరిపడినప్పటి నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విపత్తులో వందలమంది తమ సర్వస్వాన్ని కోల్పోయారని అన్నారు. ప్రకృతి విలయంలో వాళ్ల కలలన్నీ కల్లలైపోయాయని అన్నారు. ఈ దుఃఖ సమయంలో మీకు అండగా ఉంటామని బాధితులకు చెప్పినట్లు తెలిపారు. 'ఈ రోజు నేను రిలీఫ్ క్యాంపులో బాధితులను స్వయంగా కలిశాను. గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించాను. వారు చాలా కష్ట పరిస్థితిలో ఉన్నారు. వయనాడ్ విలయంలో చిక్కుకున్న వారికి అండగా నిలవాలి. అంతా కలిసి పనిచేస్తేనే బాధితులకు అ అండ దక్కగలదు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అంతా కలిసి పనిచేయాలి. ఆప్తులను కోల్పోయిన వారికి అండగా నిలుద్దాం. రాష్ట్ర ప్రభుత్వం నష్టం అంచనాలు పంపిన వెంటనే ప్రకృతి విపత్తు సాయం అందిస్తాం అన్నారు. సంఘటన జరిగిన రోజు ఉదయం నేను సిఎం పినరయి విజయన్‌తో మాట్లాడాను. మేము సహాయం అందజేస్తామని, వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చాను. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్. సైన్యం, పోలీసులు, వైద్యులు, ప్రతి ఒక్కరూ బాధితులకు వీలైనంత త్వరగా సహాయం చేయడానికి ప్రయత్నించారు. మృతుల కుటుంబీకులు ఒంటరిగా లేరని నేను హామీ ఇస్తున్నాను. వారికి



మేము అండగా ఉన్నాం. కేరళ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం వారికి సాయం చేస్తోందని తెలిపారు. వయనాడ్ కొండచరియల ప్రకృతి విపత్తును ప్రధాని మోదీ శనివారం హెలికాప్టర్ ద్వారా వీక్షించారు. ఢిల్లీ నుంచి విమానంలో కేరళకు బయలుదేరిన ప్రధాని.. ఉదయం 11 గంటలకు కన్నూర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఆయన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ రిసీవ్ చేసుకున్నారు. అక్కడ నుంచి ఓ ప్రత్యేక విమానంలో వయనాడ్ బయలుదేరారు.

# కొత్త విమానాశ్రయాల ఏర్పాటు

- పరిశీలిస్తామన్న మంత్రి రామ్మోహన్ నాయుడు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విమానాశ్రయాల భద్రతలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సైతం విమానాశ్రయాల్లో తనిఖీలు, భద్రత పట్ల అవగాహన కలిగి ఉండి.. భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. చంద్రబాబు హయాంలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బీజం పడిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. అప్పుడు ఇంత భూమి ఎందుకు కేటాయించారని పలువురు విమర్శలు చేశారన్నారు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు పాల్గొని మొక్కలు నాటారు. తల్లిపేరు మీద మొక్క నాటాలన్న ప్రధాని మోడీ సూచనలతో ప్రతి ఒక్కొ మొక్కలు నాటాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు దూరదృష్టితోనే శంషాబాద్ విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్రమంత్రి సూచించారు.

# ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు కృషి

- ఫైలేరియా రహితంగా తెలంగాణ అభివృద్ధి
- కేంద్ర మంత్రితో వర్చువల్ మీటింగ్‌లో దామోదర

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

అసలే వర్షాకాలం కావడంతో రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధుల నివారణపై చర్చించడానికి కేంద్ర మంత్రితో రాష్ట్ర మంత్రి వర్చువల్‌గా సమావేశం అయ్యారు. ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అధ్యక్షతన నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దామోదర్ శనివారం పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయం నుంచి దామోదర్ ఇందులో పాల్గొన్నారు. వీటి నిర్మూలన కోసం సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలలో 14 ఆరోగ్య కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంగారెడ్డి, మహబూ బాబాద్ జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు బోదకాలు వ్యాధి, నులిపురుగుల నివారణకు ఆగస్టు 10 నుంచి మందులుపంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

# హైదరాబాద్‌లో జొయిటిస్ విస్తరణ

- గూగుల్ ప్రధాన కార్యాలయంలో సిఎం రేవంత్
- పలు అంశాలపై అధికారులతో చర్చ..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 10:

ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జొయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కెపాబులిటీ సెంటర్ ను విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందలాది మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. హైదరాబాద్‌లోని జొయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో తమ జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని అన్నారు. హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్ గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జోయిటిస్ రంగ ప్రవేశం హైదరాబాద్ కు మరింత గుర్తింపు తెస్తుందన్నారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందని జొయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ అన్నారు. తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరి కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జొయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడే సేవలందించటంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు. జొయిటిస్ కంపెనీ విస్తరణ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వనరులు, తమ ప్రభుత్వ విధానాలపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించిందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు అన్నారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్లో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. జొయిటిస్ కంపెనీ దాదాపు 70 సంవత్సరాలుగా జంతువుల అనారోగ్యం, రోగ నిర్ధారణ, నిరోధించే మార్గాలు, చికిత్స సంబంధిత అంశాలపై పని చేస్తోంది. జంతు సంరక్షణలో భాగంగా పశు వైద్యులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు అండగా నిలుస్తోంది. ఔషధాలతో పాటు వ్యాక్సిన్‌లు, రోగ నిర్ధారణలో కొత్త సాంకేతికత, ఆవిష్కరణలపై దాదాపు వంద దేశాలకు సేవలు అందిస్తోంది.



# నిర్మానుష్యంగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్

- ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన..
- హాస్టల్ విద్యార్థులే కదా.. ఎవరు చూస్తారులే అన్న.. యజమాన్యం నిర్లక్ష్యం
- ప్రైవేటు బెస్ట్ అవైలబుల్ హాస్టల్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు?






**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్, ఆగస్టు 10:**

ప్రైవేటు పాఠశాలలకు బెస్ట్ అవైలబుల్ హాస్టల్లో కేటాయించడం పట్ల విద్యార్థుల ఆహార నియమ నిబంధనల పట్ల నిర్లక్షకు నీడలో ముందుకు వెళ్తూ నాణ్యతతో కూడిన కూరగాయలు, భోజనం, పౌష్టికాహారం పెట్టడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని క్షేత్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అచ్చంపేట పట్టణ సమీపంలో లింగోటం గ్రామపంచాయతీ లో ఆక్స్ఫర్డ్ స్కూల్ ఉంది. బుధవారం ఉదయం బ్రేక్ఫాస్ట్ విద్యార్థులకు వడ్డించడం వల్ల దాదాపు 35 మందికి ఫుడ్ పాయిజన్, అస్వస్థత, కడుపులో నొప్పి, విరోచనాలు కావడం జరిగింది. దీనికంతటికి కారణం విద్యార్థులకు నాణ్యత పరిణామం లేకుండా కుళ్లిపోయిన కూరగాయలు, ఎక్స్పర్ట్ అయిన గోధుమపిండి, కుళ్ళిన బియ్యం వంటివి వడ్డించడం పట్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు... విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు జిల్లా ఆసుపత్రుల వరకు వెళ్లిన సందర్భాలు కొక్కోలాలుగా ఉన్నాయంటున్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారుల లోపమే దీనికి అంతటికి కారణం మంటూ పలువురు ఆరోపిస్తున్నారు. బెస్ట్ అవైలబుల్ లో చదువుకున్న విద్యార్థులకు నాణ్యమైన ఫుడ్డు అందించడంలో ప్రైవేటు యాజమాన్యం పూర్తిగా విఫలం అవుతున్నార%శీ%టున్నారు. ఇకనైనా జిల్లాల వ్యాప్తంగా సంబంధిత జిల్లా యంత్రాంగం బెస్ట్ అవైలబుల్ స్కూల్ లపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఆక్స్ఫర్డ్ స్కూల్లో విద్యార్థులు లేక నిర్మానుషంగా విలవిల బోయిన స్కూల్..**

బుధవారం ఎక్స్ఫర్ట్ స్కూల్లో 35 మందికి ఫుడ్ పాయిజన్ కావడం పట్ల వాంతులు, విరేచనాలతో విద్యార్థులు అర్ధనాదాలు చేస్తుండడం పట్ల హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించడంతో ఏ ఒక్కరికి కూడా హాని జరగకుండా వైద్యులు వైద్యం అందించారు. ఒక్కసారిగా ఆక్స్ఫర్డ్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు ఏం కాకపోవడం పట్ల ఊపిరి పీల్చుకున్నారు. శనివారం, ఆదివారం సెలవులు ఉండడం పట్ల ఆక్స్ఫర్డ్ స్కూల్ హాస్టల్ లో 545 మంది విద్యార్థులకు కాను 21 మంది మాత్రమే విద్యార్థులు ఉండడం విశేషం. ఎప్పుడు విద్యార్థులతో కిటకిటలాడుకుంటూ ఉండే ఆక్స్ఫర్డ్ స్కూలు ఒక్కసారిగా నిర్మానుషంగా మారింది. శనివారం నేటి ఫోకస్ న్యూస్ దినపత్రిక ఆక్స్ఫర్డ్ స్కూల్ కు వెళ్లి పరిశీలించగా... నాణ్యతతో కూరగాయలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడం జరిగింది. ఇట్టి విషయంపై ప్రిన్సిపాల్ కు వివరణ కోసం చేస్తే అందుబాటులో లేదు. ఏదేమైనాప్పటికీ బెస్ట్ అవైలబుల్ హాస్టల్ ను కొనసాగిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై ఉన్నతాధికారులు దృష్టి సారించవలసిన బాధ్యత ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, మేధావులు అంటున్నారు.



## కూతురుతో కలిసి యువ జర్నలిస్టు యోగి ఆత్మహత్య!



**వరంగల్, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు)–ఆగస్టు 10 :**

వరంగల్ యువ జర్నలిస్ట్, తొలి వెలుగు చానెల్ స్టాఫర్‌గా పనిచేస్తున్న యోగి రెడ్డి తన కూతురు ఆద్య(9)తో కలిసి హన్మకొండ ఏకశిల పార్కుకు సమీపంలోని తన ఇంట్లో శుక్రవారం ఉరివేసు కున్నాడు. యోగి సంఘటన స్థలంలోనే మృతి చెందగా కూతురు ఆద్య ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలొదిలింది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. హన్మకొండలోని ఏకశి లా పార్కుకు సమీపంలో అద్దె రూంలో ఉంటున్న యోగి..శుక్రవారం ఉదయం నుంచే రూం నుంచి బయటకు రాలేదని తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం యోగి సన్నిహితులు ఆయన ఇంటికి వెళ్లిన సమయంలో ఎంత పిలిచినా స్పందించకపోవడంతో అనుమానంతో డోర్లు తొలగించి చూశారు. యోగి ప్రాణాలు కోల్పోయి కనిపించగా, అపస్మారక స్థితిలో ఉన్న ఆయన కూతురును కొంతమంది జర్నలిస్టులు, సన్నిహితులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. యోగి ఆత్మహత్యకు ఎందుకు చేసుకున్నాడనే విషయంపై స్పష్టత లేదు. కుటుంబ సమస్యలే కారణమా..? మరేదైనా ఉందా అన్నది తెలియాలి.

## ఆర్ఆర్ఆర్‌లో పోలీసులను పెట్టి సర్వే చేయించడం దుర్మార్గం

**– భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలి**

**– సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్ బామిని రఘుపతి)–ఆగస్ట్ 10:**

కొండాపూర్ మండలం గిర్మాపూర్ , సదాశివపేట మండలం పెద్ద పూర్ గ్రామంలో బలవంత భూసేకరణ వెంటనే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు సదాశివపేటలో జరిగినసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ భూసేకరణ పోలీసులను పెట్టి రెవెన్యూ అధికారులు సర్వే చేయడం దుర్మార్గమని అన్నారు . రైతులకు నష్టపరిహారం ఎంత ఇస్తున్నారో చెప్పకుండా అధికారులు ఇష్టానుసారంగా సర్వేలు చేయడం సరైనది కాదన్నారు. రెండు పంటలు వండే భూములను బలవంతంగా గుంజుకుంటూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతుల ఇష్టం లేకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటు కు మూడింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. భూమికి భూమి ఇవ్వాలని భూములు కోల్పోతున్న ప్రతి రైతు కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ,600 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని అన్నారు. తక్షణమే కలెక్టర్ చొరవ తీసుకొని నష్టపరిహారం ఎంత చెల్లిస్తున్నారో చెప్పాలని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.ప్రవీణ్ నాయకులు రమేష్ గౌడ్ ఏసోబు తదితరులు పాల్గొన్నారు.




## తొర్రూరులో దొంగల హల్ చల్

- మెయిన్ రోడ్డు షాపులె టార్గెట్
- ఒకేసారి 2షాపుల్లో దొంగతనం
- ఒక్క షాప్‌లో సిగరెట్లు చోరీ.. మరో షాపులో బట్టలు చోరీ..
- తొర్రూరు డిఎస్పి సురేష్ బాబు, ఎస్ఐ రాంజీ నాయక్


**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్టు 10:** మెయిన్ రోడ్డులో ఒకేసారి రెండు షాపుల్లో దొంగలు పడ్డ సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భవాని జనరల్ స్టోర్ మరియు పద్మావతి క్లాత్ స్టోర్ రెండు షాపులలో ఒక్కసారిగా ఇద్దరు దొంగలు ముసుగులు వేసుకొని చోరికి పాల్పడ్డారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి పొడవాటి గుణపం లాంటి కట్టర్ తో షాప్ తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న తొర్రూరు డిఎస్పీ సురేష్ బాబు, ఎస్సై రాంజీ నాయక్,లు రెండు షాపులను సందర్శించిన వెంటనే క్లూస్ టీమ్ ను పంపించి వివరాలు సేకరిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై రాంజీ నాయక్ తెలిపారు.

**సిగరెట్ డబ్బాలు దొంగతనం చేశారు: సెల్ సింగ్ (భవాని జనరల్ స్టోర్ యజమాని)**

శుక్రవారం రాత్రి 9 గంటలకు భవాని జనరల్ స్టోర్ షాప్ కు తాళాలు వేసి వెళ్లిపోయాము. శనివారం రోజున షాపు తెరవడానికి వచ్చి చూడగానే షట్టర్ యొక్క తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో షాప్ లో ఏమైనా పోయాయని చూసుకున్నాము. కానీ అంత విలువైన వస్తువులు ఏమి పోలేదు కానీ సిగరెట్ డబ్బాలు మాత్రం అధికంగా చోరీకి గురయ్యాయి.. అదేవిధంగా గల్లలోని 10 కాయిన్స్ కూడా తీసుకువెళ్లారు, వాటితో పాటు సీసీ కెమెరా డివిఆర్ బాక్స్ కూడా దొంగలించారని తెలిపారు.

**పద్మావతి బట్టల షాపులో చోరీ: కందకట్ల గోపి, (పద్మావతి క్లాత్ స్టోర్ యజమాని)**

పద్మావతి బట్టల షాపులో అధికంగా బట్టలు దొంగలించారని షాపు యజమాని వాపొయ్యారు. శనివారం ఉదయం షాప్ ఓపెన్ చేసి చూడగానే షాప్ తాళాలు పగలగొట్టి షాపులో నుండి బట్టలు సంచులు దొంగలించారు. వెంటనే సీసీ కెమెరాలు చూడగా శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఇద్దరు వ్యక్తులు ముసుగులు వేసుకొని దొంగతనానికి పాల్పడ్డారు. షాపులో నుండి సుమారుగా 60 వేల నుండి 70 వేయిల వరకు బట్టలు దొంగళించారు. వెంటనే పోలీసులకు సమాచారాన్ని అంద.జేశాం అని తెలిపారు.





## బుడ్డతండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

- గిరిజనుల సంప్రదాయాలతో మొలకల ఊరేగింపు
- లంబాడి గిరిజనుల కులదైవానికి ప్రత్యేక పూజలు
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్ ఆగస్టు 10:**

లంబాడా గిరిజనులు ప్రతి ఏటా ఎంతో పవిత్రంగా, ఉత్సాహంగా నిర్వహించుకునే తీజ్ మొలకల పండుగ శనివారం అచ్చంపేట మండల పరిధిలోని బుడ్డ తండ గ్రామంలో గిరిజనులంతా ఒకచోటకు చేరుకొని తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై తీజ్ ఉత్సవాల్లో గిరిజనులతో మొలకలు బుట్ట నెత్తిపై పెట్టుకుని ఊరేగింపులో గిరిజనుల సంప్రదాయ బద్దంగా ముందుకు సాగుతూ... గిరిజనుల కులదైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామంలో ఉన్న అమ్మాయిలు ప్రతి ఒక్కరు మొలకల బుట్టలను నెత్తిపై ఎత్తుకొని ఊరేగింపులు పాల్గొన్నారు. గ్రామంలో వివిధ వేషధారణలతో గిరిజనులు నృత్యాలు చేసుకుంటూ సంబరాలు నిర్వహించుకున్నారు. ప్రతి ఏటా మొలకల పండుగలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా.. ఉల్లాసంగా ముందుకు వెళ్తారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల కుల పెద్దలు, నాయకులు, మహిళలు, యువతి, యువకులు మొలకల పండగ సంబరాల్లో పాల్గొన్నారు.





నేటి ఫోకస్ న్యూస్
ఆదివారం 11, ఆగస్ట్ 2024

# అభిమానులకు థ్యాంక్స్: మహేశ్


తన అభిమానులను ఉద్దేశించి నటుడు మహేశ్‌బాబు ఆసక్తికర పోస్ట్ పెట్టారు. శుక్రవారం తన పుట్టినరోజుని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఆయన థాంక్యూ చెప్పారు. 'నిన్న నా పుట్టినరోజు సందర్భంగా మీరు పంపించిన సందేశాలు, చూపించిన ప్రేమాభిమానాలు చూసి ఆనందంతో ఉప్పొంగిపోయా. మీరందరూ ఈ స్పెషల్ డేని నాకు మరింత ప్రత్యేకంగా మారేలా చేశారు. ప్రతి ఏడాది మీరు నాపై చూపిస్తోన్న ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. లవ్ యూ' అని ఆయన ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'లవ్ యూ అన్నా' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్‌బాబు పుట్టినరోజును పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఆయన అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారీ కటౌట్లు ఏర్పాటుచేసి కేకులు కట్ చేసి తమ ప్రేమను చాటుకున్నారు. మరోవైపు, మహేశ్ నటించిన 'మురారి' మూవీ రీ రిలీజ్ అయ్యింది. ఈసందర్భంగా ఆయా థియేటర్ల వద్ద సినీప్రియుల సందడి కనిపించింది. ఇక, సినిమాల విషయానికి వస్తే.. ఈ ఏడాది ఆరంభంలో 'గుంటూరుకారం'తో ప్రేక్షకులకు వినోదాన్ని అందించారు మహేశ్. ప్రస్తుతం ఆయన తన తదుపరి ప్రాజెక్ట్ కోసం సన్నద్ధమవుతున్నారు. రాజమౌళి దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. మహేశ్ 29వ చిత్రమిది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దీనికి 'మహారాజ్' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు టాక్. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు.



# గ్లామర్ డోస్ పెంచిన ఐశ్వర్య

దక్షిణ భారత చిత్రపరిశ్రమలో ప్రతి ఒక్కరికీ బాగా పరిచయమున్న హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ .కెరీర్ ఆరంభంలో హోమ్లీ గర్ల్‌గా ముద్ర వేసుకున్న ఈమె.. ఇపుడు గ్లామర్ డోస్ పెంచి ప్రతి ఒక్కరినీ ఆశ్చపరుస్తున్నారు. పా. రంజిత్ దర్శకత్వంలో 2011లో వచ్చిన 'అట్టకత్తి' సినిమాలో ఒక మంచి పాత్ర ద్వారా ఐశ్వర్య రాజేష్ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'పుత్తగం' సినిమాలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. 'రమ్మీ' సినిమాలో విజయ్ సేతుపతి సరసన నటించారు. అయితే, 'కాక్కాము÷-టట్టై' సినిమా ఆమె సినీ కెరీర్‌కు ఓ టర్నింగ్ పాయింట్‌లా నిలిచింది. ఫలితంగా కోలీవుడ్ సరిహద్దులను దాటి తెలుగు, మలయాళ భాషల్లో కూడా వరుస అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. మధ్య లేడీ ఓరియంటెడ్ పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'ఫర్హానా'లో ఆమె ఒక ముస్లిం గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా పోషించిన పాత్రకు ప్రశంసలు వచ్చాయి. సినిమాలే కాకుండా ఐశ్వర్య రాజేష్ సోషల్ మీడియాలో సైతం ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన తాజా ఫొటోషూట్ ఫొటోలను షేర్ చేస్తూ ఉంటారు. అయితే ఎప్పుడూ కూడా లిమిట్ దాటింది లేదు. కానీ ఇటీవలికాలంలో ఆమెలో చాలా మార్పు కనిపిస్తోంది. ఈ మధ్య ఆమె స్పెషల్ ఫొటో షూట్‌ల పేరుతో ఎక్స్‌పోజ్ చేస్తూ, సోషల్ మీడియాలో ఫొటోలను షేర్ చేస్తున్నారు. దీంతో సినీ ప్రేక్షకులే కాదు ఆమె ఫ్యాన్స్ సైతం ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే, ఇప్పటి వరకు ఆమె హోమ్లీ గర్ల్ గానే కనిపించింది. ప్రేక్షకులు కూడా ఆమెను అలాగే ఇష్టపడుతూ వచ్చారు. కానీ, ఒక్కసారిగా ఇలా గ్లామర్ టచ్ ఇవ్వడంతో ఆమె ఫ్యాన్సే కాదు, నెటిజన్లు కూడా ఆశ్చర్యపోతున్నారు. మరి కాంపిటేషన్‌లో తనూ ఉండాలని అనుకుంటుందో, లేదంటే గ్లామర్ టచ్ ఇవ్వకుంటే అవకాశాలు రావని అనుకుంటుందో తెలియదు కానీ.. తను కూడా ఎక్స్‌పోజింగ్‌కు రెడీ అన్నట్లుగా సిగ్నల్స్ పంపుతుంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. హోమ్లీని పక్కనెట్టి గ్లామర్‌ని నమ్ముకుంటున్న ఈ భామకు ముందు ముందు ఎలాంటి అవకాశాలు వరిస్తాయో చూడాలి.








# నేడు వరుణ్‌తేజ్ మట్కా ఫస్ట్‌లుక్

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్నాడు. 2019లో ఆయన నటించిన గద్దలకొండ గణెశ్ తర్వాత వచ్చిన గని, ఈ3, గాండీవధారి అర్జున, ఆపరేషన్ వాలెంటైన్ చిత్రాలలో ఒక్క సినిమా కూడా హిట్ కాలేదు. వరుణ్ తేజ్ ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న పాన్ ఇండియా సినిమా మట్కా పైనే ఉన్నాయి. మట్కాతో హిట్ కొట్టి మళ్లీ ఫామ్‌లోకి రావాలని చూస్తున్నాడు ఈ మెగా హీరో. పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఆగష్టు 11న ఉదయం 11.07 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. ఇప్పటికే సగ భాగానికి పైగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.